## క్లుప్తంగా

### బైరాపురం వాసికి డాక్టరేట్


కురువ మద్దిలేటి

మిడుతూరు: మండల పరిధిలోని బైరాపురం గ్రామానికి చెందిన కురువ శేషమ్మ, బాలస్వామిల కుమారుడు కురువ మద్దిలేటికి కడప యోగి వేమన యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీలోని వ్యాపార నిర్వహణ విభాగంలో ప్రొఫెసర్ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో ఏ స్టడీ ఆఫ్ అసెట్–లియబిలిటీ మేనేజ్మెంట్ ఆఫ్ సెలెక్ట్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని రచించాడు. దీంతో యూనివర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ నల్లపురెడ్డి, ఈశ్వరరెడ్డి డాక్టరేట్‌ను అందజేశారు.

### భూహక్కు పథకానికి 924 మంది ఎంపిక

కొత్తపల్లి: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకానికి నందికుంట గ్రామానికి చెందిన 924 మంది రైతులు ఎంపికైనట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ శనివారం తెలిపారు. వీరిలో 74 మంది రైతులు చనిపోయారని, మిగిలిన 701 మంది రైతులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత భూ హక్కు పత్రాలు మంజూరు చేశామని వివరించారు. ఇంకా 30 మంది రైతులు సంబంధిత రెవెన్యూ రికార్డుల్లో సవరణల వల్ల, పట్టాదారు పాసుపుస్తకంలో తప్పులు ఉండడంవల్ల వారికి పత్రాలు రాలేదని చెప్పారు. మరో 119 మంది రైతులు వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నందున వారికి సమాచారం అందించి భూ హక్కు పత్రాలను అందించనున్నట్లు తెలపారు.

### భూమి పేదవాడి హక్కు


ర్యాలీలో సీపీఐ, ఏపీ వ్యకాస నాయకులు

పాములపాడు: ప్రతి పేదవాడికి భూమి హక్కుగా ఉండాలని సీపీఐ మాజీ ఎమ్మెల్సీ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్ అన్నారు. శనివారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భూపోరాటంలో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాల కోసం సర్వే నెంబరు 465/డీలో 5 ఎకరాల భూమి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. బీకేఎంయూ జెండావిష్కరణచేశారు. ఆయన మాట్లాడుతూ పలు చోట్ల భూములు అడవులను తలపిస్తున్నాయన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా తక్షణమే ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, నాయకులు బాబా ఫకృద్దీన్, రాధాకృష్ణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పందుల తరలింపు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిసరాలతో పాటు ప్రధాన వీధుల్లో సంచరిస్తున్న పందుల తరలింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. మహానందిలో పందుల బెడదపై ఈఓ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో పందులను ఇతర ప్రాంతాలకు తరలించారు. కాగా, మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, అబ్బీపురం గ్రామంలోనూ పందుల సంచారం అధికంగా ఉందని, వాటి తరలింపునకు కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రిలో లాల్‌రెడ్డికి పింఛన్ అందించిన వెల్ఫేర్ అసిస్టెంట్ లింగమయ్య యాదవ్

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన గంగవరం లాల్‌రెడ్డి గుండెకు బైపాస్ సర్జరీ కావడంతో కొద్దిరోజులుగా నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా లాల్‌రెడ్డికి ఇటీవల నూతనంగా వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. అందించేందుకు ఇంటివద్దకు వెళ్లగా కుటుంబ సభ్యుల ద్వారా ఆస్పత్రిలో ఉన్న విషయం తెలుసుకున్న సచివాలయం-1 వెల్ఫేర్ అసిస్టెంట్ లింగమయ్యాయాదవ్ శనివారం నంద్యాలలోని ఆస్పత్రికి చేరుకుని లాల్‌రెడ్డికి పింఛను అందించారు. దీంతో లాల్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

### ఎంఎస్‌పీ జిల్లా కోకన్వీనర్‌గా పూల వెంకటసుబ్బన్న

బండిఆత్మకూరు: మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) నంద్యాల జిల్లా కో కన్వీనర్‌గా పూల వెంకటసుబ్బన్న ఎంపికయ్యారు. శనివారం వెంకటసుబ్బన్న మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ తనను ఎంపిక చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులందరిని సమన్వయం చేసి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

# మినుముకు తెగుళ్లు.. రైతన్న దిగాలు

- డివిజన్ పరిధిలో విస్తారంగా సాగు
- తెగుళ్ల బెడదతో ఆందోళనలో అన్నదాత
- జాగ్రత్తలతో నివారణ


ఆత్మకూరు సమీపంలో సాగుచేసిన మినుము పంట


తెగులు సోకిన మొక్క, లద్దె పురుగు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఈ ఏడాది రబీలో మినుము పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలు అతివృష్టి, అనావృష్టి ప్రభావం వలన తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో రబీ పంటగా మినుమువైపు మొగ్గు చూపారు. అయితే ఈ పంటకు ఊహించని విధంగా తెగుళ్ల అధికమయ్యాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**దిగుబడి తగ్గే అవకాశం**

రబీ సీజన్‌లో ఆత్మకూరు మండలంలో 10 వేలు, వెలుగోడు మండలంలో 3 వేలు , కొత్తపల్లి 7 వేలు, పాములపాడు 9 వేల ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. అయితే పంట వేసిన 15 రోజుల నుంచే పైరుకు వివిధ తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంటకు దోమపోటు, పసుపుపచ్చ పురుగు, పల్లాకు తెగుళ్లు, పూత పురుగు, బూడిద తెగులు, ఆకుమచ్చ, లద్దె పురుగు, పచ్చపురుగు, ఎండుతెగుళ్ల వ్యాపిస్తున్నాయి. వీటి నివారణ కోసం అత్యధికంగా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు మరింత భారమవుతున్నాయి. కాగా, సాధారణంగా మినుము పంట ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని భావిస్తున్న రైతులు ఈ తెగుళ్ల వలన తీవ్రంగా నష్టపోతామేమోనని దిగాలు చెందుతున్నారు.

### 15 రోజులకే తెగుళ్లు సోకాయి



నాలుగు ఎకరాల్లో మినుము పంట సాగు చేశా. పంట సాగు చేసిన 15 రోజులకే తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. లద్దెపురుగు, ఆకుమచ్చ తెగుళ్లతో పాటూ వివిధ రకాల తెగుళ్లు అధికమయ్యాయి. ఫలితంగా రైతులు అధికంగా నష్టపోతామనే భయం నెలకొంది. వ్యవసాయాధికారులు పంట పొలాలను సందర్శించి సలహాలు, సూచనలు ఇవ్వాలి. –బూశన్న, రైతు, ఆత్మకూరు

### ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



ఆత్మకూరు డివిజన్ పరిధిలో సాగు చేసిన మినుము పంటకు ఆసిస్తున్న వివిధ రకాల తెగుళ్లపై రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. రైతులు విత్తువేసిన 15, 20 రోజుల నుంచే క్రిమిసంహారక మందులు ఉపయోగిస్తే తెగుళ్ల నుంచి మినుము పంటను కాపాడుకోవచ్చు. వాస్తవానికి మినుము పంటలో పల్లాకు తెగులు ఉద్ధృతంగా ఉంటుంది. అయితే రైతులు టీబీటీ 104 , పీయూ 31, వీబీఎన్ 81, టీజీబీ129 రకాలను ఉపయోగిస్తే తెగుళ్ల ఆశించే అవకాశం ఉండదు. ప్రధానంగా విత్తన శుద్ధి చేయాలి. పొలాల్లో లింగాకర్షక బుట్టను ఎకరానికి 5, 6 ఉంచాలి, జిగురు అట్టలు 8, 10 ఉపయోగించాలి. లద్దె పురుగు నివారణకు 10 కేజీల పాలిష్ తౌడు, రెండు కిలోల బెల్లం, 400 ఎంఎల్ మోనోక్రోటోఫాజ్ కలిపి సాయంత్రం వేళ పొలాల్లో చల్లాలి. పూత పురుగు మినుము పంటలో అధికంగా ఉంటుంది. దీని నివారణకు నొవాల్యురన్ ఎకరాకు 400 మి.లీ, వేపనూనె 500 ఎంఎల్ లేదా థయోడీకార్బ్ పిచికారీ చేసుకోవాలి. బూడిద తెగులు ఎక్కువగా వాతావరణ పరిస్థితి వలన, మబ్బులు ఎక్కువగా ఉంటే వ్యాప్తి చెందుతుంది. నివారణకు సల్ఫర్ 600, రెండవ దశలో మైక్రో బ్యుటానియల్ పిచికారీ చేయాలి. పచ్చ పురుగుకు కొరాజిన్ లేదా బెంజేయేట్ ఉపయోగించాలి. పంట ఆశించే సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండి తెగుళ్ల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. – విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ, ఆత్మకూరు

### ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయ నిర్మాణం


గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, తదితరులు

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): నందికొట్కూరు పట్టణంలో త్వరలో ఆధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. శనివారం ఆయన పట్టణంలో శిథిలమైన గ్రంథాలయ భవనం, స్థలాన్ని పరిశీలించారు. వందేళ్లక్రితం నిర్మించిన భవనంలో గతంలో గ్రంథాలయాన్ని నిర్వహించే వారని, అది శిథిలమవ్వడంతో ప్రస్తుతం అద్దెభవనంలో కొనసాగిస్తున్నామని లైబ్రేరియన్ మురళీధర్ తెలిపారు. శేషగిరిరావు మాట్లాడుతూ త్వరలో కర్నూలు పట్టణంలో ఉన్న గ్రంథాలయంలాగే పాఠకులకు ఆన్‌లైన్ సౌకర్యం ఉన్న కంప్యూటర్లతో పాటు పోటీపరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు అవసరమైన సౌకర్యాలతో కూడిన గ్రంథాలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కర్నూలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్దూరు సుభాష్‌చంద్రబోస్, జిల్లా కార్యదర్శి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- 9వ వార్డు సచివాలయం పరిధిలో కొనసాగిన 'గడప గడపకు మనప్రభుత్వం'

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): రాజకీయ పలుకుబడి, మధ్యవర్తిత్వం, అవినీతి, అక్రమాలకు తావు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయ మని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అ న్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని 9వ వార్డు సచివాలయం పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం వారికి మంజూరు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరాభిమానాలను చూసి టీడీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. రాజకీయ ఉనికికోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. అయినా వారి తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. చంద్రబాబునాయుడు ఆయన రాజకీయ ఉనికి కోసం ప్రచారాలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు బలిగొంటున్నారని విమర్శించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే రాక్షసులకు ప్రజలు ఎన్నడూ పట్టం కట్టరని స్పష్టం చేశారు. కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం పనులతో పాటు ఇళ్లస్థలాలు ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయించాలని స్థానికులు కోరారు. కాలనీకి సక్రమంగా తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్‌ను ఆదేశించారు.

**సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ**

గడప గడప కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సబ్‌రిజిస్ట్రార్ చంద్రమౌళిని, అక్కడి వచ్చిన ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకొన్నారు. స్థలం కేటాయించి భవననిర్మాణానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ షకూర్‌మియ్య, సహకార సొసైటీ చైర్మన్ నగినేల హుసేనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు విక్టర్, జాన్, కౌన్సిలర్ జాకీర్, వెంకటస్వామి, శంకర్, రమేష్, వలిబాషా, భాస్కరరెడ్డి, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీతోనే పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- అమలాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- కార్యక్రమానికి విశేష స్పందన
- అడుగడుగునా పూలమాలలు, హారతులతో ఘనస్వాగతం


లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పేదల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అమలాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. హారతి, పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు వివరించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉంటే చాలు ఇళ్లముందుకే పథకాలు వస్తున్నాయని, ఇందుకు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వండిన పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం రుచిగా ,శుభ్రంగా అందించాలన్నారు. చిన్నారులతో ముచ్చటించారు.

**సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం**

గ్రామంలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని, పింఛన్లు, పక్కాగృహాలు మంజూరు చేయాలని తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఎమ్మెల్యే అక్కడికక్కడే అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ టీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ మధు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, అంజాద్‌అలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు నారాయణరెడ్డి, శివశంకర్‌నాయక్, కోట్ల నాగేశ్వరరెడ్డి, శేషిరెడ్డి, రవినాయక్, కలిముల్లా, సుల్తాన్, తిరుపాల్, స్వామన్న, రమణయ్య, శివన్న, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**

ఆత్మకూరు పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంపై ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆరా తీశారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడు నాగన్న కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

**నూతన బస్సుల ప్రారంభం**

పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో నూతన అద్దె బస్సులను శనివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. రెండు సూపర్ లగ్జరీలు, మూడు పల్లెవెలుగు బస్సులు.. ఆత్మకూరు–నంద్యాల, ఆత్మకూరు –కర్నూలు, నంద్యాల–తిరుపతి సర్వీస్‌లను జెండా ఊపి ప్రారంభించారు. సూపర్‌లగ్జరీ బస్సులను ఎమ్మెల్యే శిల్పా స్వయంగా కొంత దూరం నడిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు, కోటయ్య నాయక్, షేక్షావలి, మన్సూర్‌వలి, షఫివుల్లా, పువ్వాడ భాస్కర్, విజయచౌదరి తదితరులు పాల్గొన్నారు.


బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే శిల్పా

# లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: స్థానిక కోర్టులో ఫిబ్రవరి 11న నిర్వహిస్తున్న నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్‌జడ్జి రఘునాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కోర్టులో శనివారం లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. కక్షదారులతో మాట్లాడి కేసులను రాజీ మార్గంలో ద్వారా పరిష్కరించాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు కృష్ణమూర్తి, ముబీనాతాజ్, జగన్‌మోహన్‌యాదవ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు దొంగల అరెస్టు

వెలుగోడు: ఆత్మకూరు, వెలుగోడు పట్టణాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ శనివారం తెలిపారు. ఆత్మకూరుకు చెందిన ఇస్మాయిల్, జాకీర్ అనే వ్యక్తులు వెలుగోడు పట్టణంలోని సీపీ నగర్, ద్వారక నగర్, ఆత్మకూరు పట్టణంలో రెండు చోట్ల దొంగతనాలు చేసి తప్పించుకొని తిరుగుతుండగా శనివారం వెలుగోడు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారన్నారు. వారు దొంగతనం చేసినట్లు నేరం అంగీకరించారని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1.30 లక్షల నగదు, ఆరు బంగారు ఉంగరాలు, ఒక డిజిటల్ వాచ్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని ఆత్మకూరు కోర్టులో అప్పగించగా, వారిని జడ్జి రిమాండుకు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

# అవ్వాతాతలకు అండగా జగనన్న


లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): అవ్వా, తాత, అక్కా, చెల్లెమ్మలకు కుటుంబ పెద్దగా అండగా ఉండి వారి జీవనోపాధి నిమిత్తం ప్రతి నెల ఒకటోవ తేదీన ఇంటి తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్‌హాలులో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అడ్డుకునేందుకు పింఛన్లు తొలగిస్తున్నారనే టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా రూ.250ల పింఛన్ పెంచుతూ వచ్చే ఏడాది నాటికి రూ.3వేలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఓ విజయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌గఫార్, కౌన్సిలర్లు అబ్దుల్‌రవూఫ్, చింతా లక్ష్మిదేవి, వీరబొమ్మ రూపాదేవి, కొండ్రెడ్డి విజయమ్మ, ప్రాతకోట శాంత కుమారి, యం.సమీరా బాను, మండడి వాణి, దేశెట్టి సుమలత, వార్డు ఇన్‌చార్జ్‌లు రవీంద్రారెడ్డి, రజిని కుమార్‌రెడ్డి, రమేష్, వీఆర్ శ్రీను పాల్గొన్నారు.

# జాబుకార్డు ఉన్నవారందరికీ పనులు

బండిఆత్మకూరు: జాబుకార్డు కలిగి ఉన్న కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ బాలాజీ నాయక్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి గ్రామ పంచాయతీ, మండల పరిషత్ తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. నారాయణాపురంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న ఉద్యాన పంటల ను పరిశీలించారు. ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఏపీఓలు వసుధ, నాగార్జున, ఈసీ వరదరాజులు పాల్గొన్నారు.

**పనులు కల్పిస్తున్నాం వలసలు వెళ్లొద్దు**

ఆత్మకూరు/కొత్తపల్లి: అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించామని కూలీలు వలసలు వెళ్లవద్దని ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఎన్ఆర్‌జీఎస్ ఏపీడీ అన్వర్‌బేగం, కొత్తపల్లి ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. శనివారం ఎన్ఆర్‌జీఎస్ పనులపై వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లకుండా గ్రామాల్లో వెంటనే ఉపాధిపనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### గాయపడిన యువకుడి మృతి

ఆత్మకూరు: పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన సుమంత్ (18) కొలుకోలేక శనివారం మృతి చెందాడు. శుక్రవారం రాత్రి మోటర్ బైక్, ఆటో ఎదురుగా ఢీకొన్న సంఘటనలో చెంచు గిరిజనుడు నాగన్న మృతి చెందగా, సుమంత్ గాయపడ్డారు. క్షతగాత్రుడిని కర్నూలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేకపోయాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు

పగిద్యాల: పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున ఘాట్ నిర్వాహకులను హెచ్చరించారు. ఆత్మకూరు డీఎస్పీ ఆదేశాల మేరకు శనివారం అర్లపాడు, మూర్వకొండ, చెల్లపాడు, మంచాలకట్ట ఘాట్ నిర్వాహకులను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈనెల 15 నుంచి సింగోటం జాతర ఉన్నందున శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో అనుమతి లేకుండా ఇంజిన్ బోట్లు, చేపల బోట్ల ద్వారా భక్తులను తరలించరాదని హెచ్చరికలు జారీ చేశారు. బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోట్లు తిప్పుకోవాలంటే తప్పనిసరిగా లైసెన్స్, డ్రైవింగ్ అనుభవం, బోటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, లైఫ్ జాకెట్లు ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులు కూడా చేపలు తరలించాలంటే బోట్లకు లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ ఉంటేనే అనుమతిస్తామన్నారు. అనంతరం ఘాట్ నిర్వాహకులపై ముందస్తు బైండోవర్ కేసులు నమోదు చేశారు.

# ఆదర్శ కాలనీల్లో మౌలిక సదుపాయాలు


పడమర ప్రాతకోట లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పగిద్యాల: జగనన్న ఆదర్శ కాలనీల్లో లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఎంపీడీఓ వెంకటరమణ వెల్లడించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని తూర్పు, పడమర ప్రాతకోట, ఎం. ఎన్. ఘణపురం గ్రామాల్లోని లే అవుట్‌లను పరిశీలించారు. అనంతరం హౌసింగ్ లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. తూర్పు ప్రాతకోటలోని లే అవుట్ స్థలంలో ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టకపోవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎన్. ఘణపురంలో నాడు–నేడు కింద చేపట్టిన పాఠశాల పై కప్పు శ్లాబ్ పనులను అధికారులు పర్యవేక్షించారు. తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ పుల్లయ్య, హౌసింగ్ ఏఈ జ్యోతి, గ్రామ సర్పంచ్ పిట్టల శేషమ్మ పాల్గొన్నారు.

### ఈ క్రాప్ బుకింగ్ చేసుకోండి

మిడుతూరు: మండలంలోని రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ప్రతి రైతు ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ పీరునాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని మాసపేట, కడుమూరు గ్రామాలలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు వలన రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ తదితర పథకాలు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇంకా చేయించుకోని వారు త్వరగా చేయించుకోవాలని సూచించారు.

### సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: పంట సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. శనివారం మండలంలోని ఇస్కాల గ్రామంలో మినుము పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు మంచి దిగుబడులు సాధించి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మినుము పైరులో లింగాకర్షక పంటలను రక్షణ పంటలుగా వేయాలని సూచించారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. విత్తనశుద్ధి, రక్షక పంటల ఉపాయోగాలు, అధిక పురుగు మందుల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, మిత్ర పురుగుల గుర్తింపు తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచు పెద్ద మౌలాలి, ఏఓ ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల వ్యవసాయాధికారి హేమలత, ఏఈఓ మద్దిలేటి, వీఏఏ గోవర్ధనాచారి తదితరులు పాల్గొన్నారు.